తాడు తెగి కుండలు కిందపడి చితికితే? రసవిష గంధకాదులు వండినప్పుడు ఆ మందులు కుండనంటుకు చిట్లంకట్టుకుపోగా నీవు గోకడంలో కుండలు పగిలిపోతే?"

వీరబ్రహ్మం వెంటనే అన్నాడు. "అలా పగిలిన కుండల పెంకులన్నీ, కుండల మూతలన్నీ, కుండల మట్టులన్నీ యీ కొట్లోకి జేరేసుకున్నవాణ్ణై మీ వేదాంతులు వచ్చినా అగసాలెలో ఓ కుంపటి లాగేస్తే మరోకుంపటి అమారుచేసుకుంటూ వుంటాను" అన్నాడు.

"ఎంతమంది వేదాంతులొచ్చినా అతని కుండపెంకులన్నిటినీ, కుండమట్టులన్నిటినీ, కుండముక్కలన్నింటినీ, అవతల పారవేయలేదనీ, పారవేసినకొద్దీ అవి ఊరతాయనీ, ఎక్కడ పారవేస్తే అక్కడే దారి కడ్డుపడతాయనీ ఊహించుకుంటూ "ఈ కుండల ఖండాల్ని కుంపట్లగా ప్రజ్వాలింపజేయడమే లోకాని కుపకారము" అనీ తలపోసికుంటూ వెళ్ళిపోయినారు. వేదాంతం పరబ్రహ్మంగారు, విశ్వకర్మ కృషి కీర్తిస్తూ.

వాయుభాండాలెన్ని చితికిపోయి తొక్కుడుబిళ్ళలుగా మారిపోయి అడుగంటిపోయినా, కుండల మట్లు ఎన్నికూలిపోయినా, అమృతభాండాలెన్ని ఆఖరు అయినా, విశ్వకర్మ వీరబ్రహ్మం యొక్క కుంపటిని మరి తీసిపారవేసిన వేదాంతి లేడు. అదే చిరస్థాయిగా లోకలో నిల్చిపోయింది.

.... .... .... .... ....

## పల్లమ్మ

పల్లమ్మ కనక గ్రీసుదేశంలో స్పార్టా ఏథెన్సు మున్నగు పట్నాల యొక్క ఉచ్ఛలోపుట్టి పెరిగి వుండే ఒక చక్కని శిల్పపుచేత

విగ్రహానికి ఆదర్శప్రాయురాలిగా వుండిపోయేది. అదేకనక భారతదేశంలో పౌరాణికయుగంలో జన్మించి జవ్వనం దాల్చి వుంటే మంచి పాతివ్రత్యానికి ఆదర్శప్రాయురాలిగా వుండి పోయేది. పోనీ అంతపని జరిగి వుండడానికి బ్రహ్మ వొప్పు కొని వుండకపోయినా ఆమెను అథవా ఒక సంపన్నుల యింట్ల అధునా సృజించియుండవలసింది. ఆలా సృజించి పెంచివుంటే ఆమె నిజంగా పెద్ద మోటారెక్కి తిరిగివుండేది, అందులో ఒక శంఖాలహారం నిక్కు సరోజాం చాలమీద తులకించుకుంటూ ఒయ్యారంగా కూర్చునివుండేది. చేతులు ముట్టుకుంటేనే కంది పోతాయా అన్నంత మెత్తందనంతో విలసిల్లిపోయి యుండేది. ఇక బుజాలమాట, చెక్కిళ్ళమాట, తలపోస్తే రాజపుత్రి అంటే అలా వుంటుంది కామోసు అని అనిపించివుండేది.

పల్లమ్మ జాతకరీత్యా పైవానికి వేనికీ నోచుకోలేదు. పుట్టింది వొకానొక పూరిమెల్లి. చెట్టాపట్టిం దొకానొక కామాటి బొట్టెణ్ణి. పెట్టుకునిది మెళ్లో ఒకతీగ, కట్టుకునిది వొంటినో తోపుచీర.

మొగుడికి పొద్దున్నే జావకాచి పోసి, వణ్ణంమూట చేతి కిచ్చి, తానోచిన్న వణ్ణంమూట చేతికెత్తుకొని, మొగుణ్ణి పట్నంలో పనిలోకి పంపి తాను దివాన్‌చెరువు ప్రాంతాల్ని వున్న రిజర్వు అడివిలో పుల్లలేరుకోవడానికి పోయేది. మొగుణ్ణి మళ్ళీ పల్లమ్మ చూడ్డం అనేది రాత్రి 7, 8 గంటలప్పుడే. తాగివచ్చే వాడు: "ఏమిట్రాకంపు" అని పల్లమ్మ అడిగితే, "నీకెందుకుపోదూ!" అనీ వాడు తెలివిలో. మళ్ళీ తందనాలాడి చిందులుతొక్కేవాడు, తాగుడుమైకం మితిమీరడంలో—పల్లమ్మ వాణ్ని "ఎక్కడరా

నీ తాగడం?" అని కూడా అడిగేదికాదు. అడిగితే సున్నంలో కెముకలేకుండా చితక్కొడతాడేమో! వాడు తందనాలాడి చిందులు తొక్కుతూన్నంతసేపూ ఆ ఆడకూతురు తాను అడవిలో నుంచి తెచ్చిన కట్టెపుల్లలు, అమ్మకానికనుకొన్నవికాక, సొంతానికి అట్టేవుంచుకొన్నవి, పొయిలోపెడుతూ నీళ్లకాచుతూ గంజి కాస్తూ కాలక్షేపంచేసేది. వాళ్ళకంతకన్న ఎక్కువ బాగుపడ్డానికి అవకాశంలేదు. ఆలోచనాలేదు. కొందఱు కొందఱు పుట్టుకతోనే బొడ్డున మాణిక్యంతో పుడతారు! కొందఱి విషయంలో పచ్చిబొడ్డుమీది నూనిపొత్తికూడా కరువే!

ఈ కథ పల్లమ్మకథ కాబట్టి దానిపేరు పైకొచ్చింది. లేకపోతే పల్లమ్మలాంటివాళ్ళు ఆ వొక్కసాంఘిక శ్రేణిలో పదులు వందలు వేలువున్నారు, చెల్లాలు, సీతమ్మ, చంద్రమ్మ, ఇత్యాదులాండ్రు—అంతమందిలో పల్లమ్మ వొక్కర్తె. అంతమందితోనూ నడుస్తూ పల్లమ్మ పోవలసిందే అడివిక్కట్టెపుల్లలకు.

ఆ అడివి దండకారణ్యంతో పోలిస్తే అడివికాక పోవచ్చునేమోకాని, సర్వసాధారణంగా నాగరీకులు చూడ్డానికి భీతాంగమైన అడివే! వర్షాలు ఎగజేపినరోజులవి. ఎండ చిత్తయిదుకుతో కుత కుత మసీకార్తి. కాశీ రామేశ్వరంపోయే మహా పంథ జాజెక్కినధూళితో రయిగమ్మివుంది. ఆ బాటనే నడక ఆ అడివికి రాకపోకలు అంటే,

పల్లమ్మ విశాలనేత్రాలతో క్రొక్కొఱు మెఱుగుతీగెల్లే సాగిపోయింది అంతదూరమున్నూ, రోజూ అలవాటుకాబట్టి అలయికపడ్డట్టు కాస్తంతా కనిపించలేదు. మఱీన్నీ పాటకపుజాతి ఆడవాళ్ళల్లో ఒకటివుంది. వాళ్లు తమ అవయవ సౌష్ఠవాన్ని,

ముక్కీ, నక్కీ, తక్కీ, పాడుచేసుకుంటూ నడవరు. మఱ్ఱిచెట్ల క్రిందనుంచి పోతూవుంటే మఱ్ఱిచెట్లందుకుంటూ వున్నట్లుంటుంది వాళ్ళయెత్తు. చెట్టు చెట్టు వెలితి ఆకాశంక్రింద వాళ్ళ సోయగం దిశ లావరించుకొన్నట్టు గనిపిస్తుంది.

యథాప్రకారంగా, అనామయంగా, సునాయాసంగా పల్లమ్మ అడివిలో ప్రవేశించింది, ఒక పక్క పుంతమ్మట— ఎక్కడెక్కడ ఆ అడివిలో చితుకులు విఱిచేదీ, కొమ్మలు వంచేదీ, ఆకులు రాల్చేదీ, రోడ్డుమీదికూరికే పుటుక్కుపుటుక్కుమని, ఖణేల్ ఫెణేల్‌మని, మాఱుమోతను వినపడ్డమేగాని మనిషియొక్క అలికిడి కనపడదు, వినబడదు.

జాంపొద్దుంటుందింక. ఇఖంతా రోడ్డుమీదకు వచ్చి కట్టెపుల్లలు ఎవరివి వారు మోపులుగా కట్టుకోబోతారు.

అడివిలో పల్లమ్మగొంతు అన్నట్టయింది "పాంకఱిచిందల్లో! పాణం పోయిందల్లో!" అని. ఏమూల పుల్లలు కొట్టుకుంటూ వున్నవాళ్లు ఆ మూలకు చేరుకున్నారు. నురువు కక్కుకుంటూ వున్న పల్లమ్మను రోడ్డుమీదకు తెచ్చి పడేశారు—పాము?

ఏమిటి చెయ్యడం? పల్లమ్మ చచ్చిపోయేటట్టుంది. మంత్రం వేసేవారన్నా లేరు అక్కడెవ్వరూను—ఒకగంట అయిపోయింది—ఆ సమయానికి బంయిమంటా మోటారులారీ ఒకటి పట్నంకేసి కల్లుపీపాలతో పోతూవుండేది కనిపించింది. కల్లుపీపాలతో మోటారులారీ ఏమిటి అని అనుకోకండి! పూర్వం కావళ్ళమీద కల్లు దివాన్‌చెరువు ఆప్రాంతాంది పట్నంలోకి దిగుమతీ అయ్యేది. ఆ కల్లే యిప్పుడు పీపాలలో కెక్కించబడి మోటారులారీలమీద పాకలకు చేర్చబడుతోంది. కారణం

తాగేవాళ్ళకూ కల్లుకూగల విరహావ్యవధి తగ్గించాలనే పాటదార్ల సంకల్పం అంతే !

పల్లమ్మచుట్టూవున్న జనం లారీకి అడ్డుపడి లారీని ఆపి లారీవాణ్ణి “బాబు! బాబు! ఈ మనిషిని తీసుకుపోయి హాస్పటాల్లోపడేద్దూ. బతుకుద్దేమో! పాముకఱిచింది.” అని బ్రతుములాడారు. లారీవాడు “హాస్పటాల్దాకా చెప్పలేనుగాని కల్లుపాకదాకా తీసుకుపోతాను” అని పల్లమ్మ శరీరానికి తాను కూర్చునే ప్రాంతాన్ని తావిచ్చి, లారీ విడిచిపెట్టాడు.

పాము? అదెల్లా పల్లమ్మను కఱిచిందో, పల్లమ్మ ఆ కీకారణ్యంలో ఎల్లా కేక వేసిందో ఎల్లా కేకవేస్తే ఆ జనం మూకగా జేరుకున్నారో అదంతా ఎవరికీ అక్కర్లేకపోయింది మఱి. జనం ఎవళ్ళిళ్ళకు వాళ్ళు పోయారు—అసలైన నల్లని కోడెతాచు తొక్కివుండాలి పల్లమ్మ ఆ పాశంగా ఆ పాము కస్సుమంటూ పల్లమ్మ పొడుగునీ లేచి పల్లమ్మ బుజంమీద కాటేస్తూ బోరంశేకోరల్తో గిరుతూ జారిపడి జఱ్ఱున జెఱ్ఱిగొడ్డెంటమాయమై యుండాలి. లేకపోతే అంత అధాత్తు వళ్ళుమఱిచి నుచ్చిళ్లు కక్కుకుంటూ, వాళ్ళా వీళ్ళా అని బొబ్బలెత్తి వుండడం తటస్థించదు. పాము నరుల కళ్ళ పడకపోవడం జరిగివుండదు.

పల్లమ్మను సర్ది మోటారులారీలో కూర్చుంశబెట్టి గబగబా లారీ వదలడంలో ఒకటి రెండుచోట్ల కల్లుపీపాలు బలువు పాటివి దొర్లి అమాంతంగా రోడ్డుమీద పడ్డం జఱిగింది. వాట్ని మళ్ళీ పైకి ఎక్కించుకు, మిక్కిలివేగంతో, పోలీసువాడొప్పని వేగంతోకూడా డ్రైవరు సాయంత్రతం 5-30—6 గంటలకు చేరుకున్నాడు.

పల్లమ్మ మొగుడు—కామాటీ బొట్టెడు అన్నాం—వాడు, ఎప్పుడువస్తుందా లారీ, ఎప్పుడు చప్పరిద్దామా కల్లు అని ఉత్తదొప్ప, కుక్కతోకలా చేతిలో ఆడించుకుంటూవున్నాడు, ఆ సమయానికి. ఆ కామాటీవాడు చూణ్నేలేదు పరమపదించబోతూవున్న పల్లమ్మను. వాడు లారీరాకలోచూచింది—లారీలో వెనుకతట్టునుంచి చిల్లడి కాఱుతూవున్న ఒక పీపాలోని కల్లుధార! దానిక్రిందకు వెంటనే తనదొప్ప పెట్టి తాగమోతున్నాడు-అంగడివాడు "వెధవా!" అని వాడివీపున మొత్తి "చూచుకోరా! వెధవా ఆడ నీ పెళ్ళాంసావబోతూంది. చూచుకోరా వెధవా!" అని కూకలేశాడు.

"నా పల్లాలు! నా అమ్మి! ఇక్కడి కెలా వచ్చింది?" అంటూ ఆ మొగాడు లారీ ముందుకు పోయేడు. అప్పటి కప్పుడే లారీ మీదనుంచి పల్లమ్మను కిందకు దించేరు. పల్లమ్మ బతుకు ఎగూపిరి దిగూపిరిగావుంది.

కామాటీ చిన్నవాడు ఏమని అడుగుతాడు; పెళ్ళాన్ని? ఏమి సాయంచేయగలడు పెళ్ళానికి ఆ సమయంలో?—మొగుణ్ణి చూచింది పల్లమ్మకళ్ళు సగంతెఱచి అదే ఆఖరు చూపనుకోండి.

అందిలా—"నాబావా! ఈ యేలప్పుడు నేనింటివద్ద సావడం అంటూవుంటే నిన్ను చూణ్నే లేకపోయీదాన్నేమో? ఇక్కడ చస్తున్నాను గాబట్టి నిన్ను చూడగల్గుతున్నాను, పుణ్యవంతురాల్ని." అంటూ ప్రాణం వదిలేసింది.

ఏమాత్రం ఇంక ఆ తుది పలుకు మీద వ్యాఖ్యానంచేసినా ఆ యిల్లాలియొక్క ఆత్మశాంతికి భంగకరమేమో?

.... .... .... .... ....